


# ఆధ్యాత్మికత వృద్ధాప్యానికే పరిమితం కాదు!

**- అబ్బూరి ఛాయాదేవి**


కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత అబ్బూరి ఛాయాదేవి కథలన్నిటిలోనూ తెలుగు మహిళ ఉంటుంది. కుటుంబ, సామాజిక జీవితాల్లో ఆమె ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉంటాయి. భిన్న సందర్భాల్లో వారనుభవించిన మానసిక భావోద్వేగాల చిత్రణ ఉంటుంది. ఎంతో సునిశితమైన పరిశీలన, మరెంతో సున్నితమైన మనసు ఉంటే తప్ప రచనల్లో వాటినలా ప్రతిబింబించడం సాధ్యం కాదు. ఇంతా చేసి ఆమెది స్త్రీవాదం కాదు. సమానవాదం. కుటుంబంలో, సమాజంలో అన్నిటా స్త్రీపురుషులిద్దరూ సమానమనే ఆలోచన ఛాయాదేవిగారు రాసిన అన్ని కథల్లోనూ అంతస్సూత్రంగా కనిపిస్తుంది.

'అబ్బూరి' అని బోర్డున్న గుమ్మంలో అడుగు పెట్టి కాలింగ్ బెల్లెక్కడా అని వెతుక్కుంటున్నప్పుడు 'గాజు లాగితే గంట మోగుతుంది' అని రాసిన చిన్న కాగితం గోడకు కనిపించింది. లాగగానే చిరుగంటల సవ్వడి, వెనుకే నవ్వుతూ ఎదురొచ్చిన ఛాయాదేవిగారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో వెళ్లగానే పలకరించే రకరకాల పూలమొక్కలు

మ్యావ్‌మంటూ కనిపించే పిల్లుల మధ్య అబ్బూరి ఛాయాదేవిగారిల్లు ఒక పర్ణశాలలాగా, ఆవిడొక ఋషిలాగా కనిపించారు. తెలుగు కథా సాహిత్యంలో అబ్బూరి ఛాయాదేవి ఒక నిశ్శబ్ద విప్లవం. ఆవిడతో 'నవ్య' ఇంటర్వ్యూ విశేషాలు..

**మీ చిన్ననాటి అనుభవాలు చెప్పండి.**

సంప్రదాయ కుటుంబంలో రాజమండ్రిలో పుట్టి పెరిగాను. అన్నయ్య, అక్కల తర్వాత నేను, చెల్లి. నాన్న న్యాయవాది. మా అక్కకి పద్నాలుగేళ్లకే పెళ్లి చేసేశారు. మా అన్నయ్య ఇంగ్లాండులో చదువుకునే



భర్త రాజేశ్వరరావు, కాళోజీలతో...

వాడు, మమ్మల్ని కాస్త ఆధునికంగా ఉండమని చెప్పే వాడు. అన్నయ్య ప్రోద్బలంతోనే నా చదువు సాగింది, పెళ్లి మరీ పదహారేళ్లకే కాలేదు.

**★ రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు ఎలా వచ్చారు?**

అదో కథ. బీయే చదువుతున్నప్పుడు నాకు పెళ్లి చూపులు జరిగాయి. పెళ్లి ఉత్తరం రాస్తారనుకుంటే ఆ కుర్రాడు వేరే ఎవర్నో ఇష్టపడి పెళ్లి చేసుకున్నాడని తెలిసింది. రాజమండ్రి చిన్న ఊరు కదా, నలుగురూ ఏమైనా అనుకుంటారని, నా మనసు పాడవుతుందని మా అన్నయ్య తన ఇంటికి హైదరాబాద్ తీసుకొచ్చేశాడు. ఇక్కడ ఎమ్మేలో చేరాను. వాళ్లింట్లో రేడియో ఉండేది. దాన్ని వినడం భలే సరదాగా ఉండేది. హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారు, పీఎస్సార్ అప్పారావుగారు వీరి ప్రోత్సాహంతో కాలేజీ లోనే నాటకాలు వేయడం వంటివి అలవాటయింది. దాంతో రేడియోలోనూ చిన్నచిన్న ప్రసంగాలివ్వడం, నాటికలు వేయడం వంటివి చేసేదాన్ని.

**★ మద్దాలి ఛాయాదేవి అబ్బూరి ఛాయాదేవిగా మారినదెప్పుడు?**

ఎమ్మే చదువుతున్నప్పుడు రేడియో టాక్స్ అవీ చేసేదాన్నని చెప్పాను కదా, అప్పుడు భాస్కరభట్ల కృష్ణారావని ఉండేవారు. ఆయన కథకుడు. ఏం రాసినా చదివి ప్రోత్సహించేవారు. 'మంచి భర్తను ఎన్నుకోవడం ఎలా' అని నేనొక అంశం తీసుకుని మాట్లాడాను. అదయిపోయి బయటికొస్తుంటే 'ఎలాంటి భర్త కావాలి నీకు' అని అడిగారు. మంచి వాడు, కట్నం అడగనివాడూ అన్నాను. 'అలాంటి వాణ్ని చూపిస్తే చేసుకుంటావా' అన్నారు. నేను సరేనని ఇంటికొచ్చేశాను. ఆయన అబ్బూరి వరదరాజేశ్వరరావుగారికి చెప్పారు. అబ్బూరికీ మా అన్నయ్యకు అప్పటికే పరిచయముంది. దాంతో ఆయన మా అన్నయ్య ఇంటికొచ్చి నన్ను చూసి 'అంతా బావుంది, నేను మావాళ్లతో చెబుతాను లెండి' అని వెళ్లిపోయారు. ఆ కుర్రాడు వాళ్లింట్లో చెప్పేక మనం అడుగుదాం అని మానాన్నగారు వాళ్లూ ఊరుకున్నారు. ఆయన చెప్పలేదు. నెమ్మదిగా విషయం మా మామగారికి తెలిసింది. మా పెళ్లిముందు వరదలు. 'అందరం వరద బాధితులమే..' అంటూ చమత్కరించి నవ్వేశారాయన. తర్వాత పెళ్లి సాఫీగా అయిపోయింది. ఇదంతా 1953 సంగతి.

**★ లెక్చరర్‌గా వెళ్లకుండా లైబ్రేరియన్‌గా పని చేశారేమిటి?**

లెక్చరర్‌గా చెయ్యడానికి అనువైన కంఠస్వరం కాదు నాది. మా మామగారు అబ్బూరి రామకృష్ణారావుగారు ఆంధ్రా యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా పనిచేసేవారు. దాంతో నన్ను కూడా ఆ కోర్సు చేసి అందులో చేరమన్నారు. అలా నేను ఆ లైన్లోకి వెళ్లేను. తర్వాత న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో 1982 వరకూ డిప్యూటీ లైబ్రేరియన్‌గా పనిచేశాను. దానికి స్వచ్ఛంద విరమణ చేసి హైదరాబాద్‌లో స్థిరపడ్డాం.

**★ తొలి కథ కబుర్లు..**

నా అనుభవాలు, అనుభూతులను కథలుగా చెప్పాలని చిన్నప్పటినుంచీ అనిపించేది. దానికి బీజం పడింది అన్నయ్య ఇంట్లోనే. మా వదిన మద్దాలి రుక్మిణీగోపాల్ పేరుతో కథలు రాసేది. వివిధ పత్రికలు చదివి నాతో చర్చించేది, నాకు ఖాళీ లేకపోతే తనే కథ ఇదీ.. అంటూ చెప్పేది. నేనూ ఏదైనా చదివినప్పుడు తనకి చెప్పేదాన్ని. అలా నాకు కథ చెప్పడమే అలవాటయింది. అదే పద్ధతి నా రాతలోనూ ప్రతిబింబిస్తుంది. వదిన రాయడం చూసి, నేను మాత్రం రాయలేనా అని కథలు రాయడం మొదలుపెట్టాను. మద్దాలి ఛాయాదేవి పేరుతో నా తొలికథ 'అనుబంధం' 1952లో నిజాం కాలేజ్ పత్రిక 'విద్యార్థి'లో అచ్చయింది. కుటుంబంలో పురుషాధిపత్యం ఎలా ఉండేదో, స్త్రీలు అందులోనే ఎలా ఆనందాన్ని వెతుక్కున్నారో తెలుపుతూ రాసిన కథ అది. అలాంటిదే మరో కథ 1955లో 'తెలుగు స్వతంత్ర'లో వచ్చింది.

**★ కథలు, 'కవిత' సంపాదకత్వం, అనువాదాలు.. ఇలా మీ సాహితీ జీవితంలో మలుపులెన్నెన్నో. వాటి గురించి కొంచెం విపులంగా చెప్పండి.**


పెళ్లయిన తర్వాత 1954లో కవిత 1, 2 సంచికలకు సంపాదకత్వం వహించాను. ఎక్కువ బాధ్యత మావారే తీసుకునేవారు. వివిధ దేశాల జానపదగాథలతో పిల్లలకోసం 55లో 'అనగాఅనగా' పుస్తకాన్ని తీసుకొచ్చాను. 56లో జర్మన్ కథకుడు స్టెఫాన్ జ్వైక్ కథలను అనుసరిస్తూ నేను రాసినవి 'అపరిచిత లేఖ, ఇతర కథలు'గా ప్రచురితమయింది. ఆ ఏడాది 'మోడర్న్ తెలుగు పోయెట్రీ', ఆంధ్రయువతీమండలి తరఫున 'వనిత' మాసపత్రికల సంపాదకత్వంతో ఊపిరాడకుండా ఉండేదాన్ని. పిల్లలు లేరన్న ఆలోచనే లేకుండా చేసేవీ పనులు. అలా ఉండాలనే నా నెత్తిన ఇవన్నీ పెట్టేరేమో మావారని కూడా అనిపిస్తుంటుంది అప్పుడప్పుడూ. అయితే దేన్నీ కష్టమనుకోలేదు నేను. ప్రూఫులు చూడటం మొదలుకుని ప్రతి చిన్న పనినీ ఇష్టపడి శ్రద్ధగా చేశాను.

**★ వాటిలో మీరు మరిచిపోలేని అనుభవం చెప్పండి?**

మోడర్న్ తెలుగు పోయెట్రీ పుస్తకాన్ని అప్పటి ప్రధాని నెహ్రూగారికి బహుమతిగా ఇవ్వాలనుకున్నాం. అప్పట్లో ఇంత సెక్యూరిటీ, ఇంత ప్రోటోకాల్ ఉండేవి కాదు. ఆయన పుట్టినరోజునాడు ఆఫీసుకు ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ తీసుకుని నేనూ మావారు వెళ్లాం. నెహ్రూగారు పుస్తకాన్ని పరిశీలించి నా పేరు చూసి 'క్యా ఇస్ లడ్‌కీ నే కియా' (ఈ అమ్మాయి చేసిందా) అని ఆశ్చర్యపోయారు. అది నాకెప్పటికీ గుర్తుండిపోయే సందర్భం. మేం వెళ్లినప్పుడే నెహ్రూగారిని కలవాలని ఒక పాములవాడొచ్చాడు. తాను సేకరించిన రకరకాల పాముల్ని చూపెడుతూ ఒకదాన్ని ఆయన మెడలో కండువాలాగా వేశాడు. అది కొద్దిగా పైకి జరిగి శివుడి మెళ్లో పాములాగా ఇలా పడగవిప్పింది. నెహ్రూగారు గులాబీరంగులో ఉండే మనిషి. ఆ పాము తిరుగుతుంటే

## నచ్చినవి

| | |
|---|---|
| సినిమాలు | : విప్రనారాయణ, షబానా అజ్మీ నటించిన అంకుర్ |
| హీరో | : నాగేశ్వరరావు |
| హీరోయిన్ | : భానుమతి |
| గాయని | : భానుమతి |
| గాయకుడు | : బాలసుబ్రమణ్యం |
| ప్రదేశం | : హైదరాబాద్ |
| ఆహారం | : పులిహోర, స్వీట్లేవైనా ఇష్టమే. |
| నవల | : వాసిరెడ్డి సీతాదేవి రచన 'మరీచిక'. |
| కథ | : శ్రీపాద రచన అరికాళ్ల కింద మంటలు |
| కథకులు | : శ్రీపాద, ఓల్గా |
| స్నేహితులు | : అడవికొలను లక్ష్మి, అన్నపూర్ణ |
| బంధువులు | : చెల్లెలు పోడూరి యశోధర, ఆడబడుచు సి. సుజాతామూర్తి. |
| హబీలు | : బొమ్మలు చెయ్యడం, పిల్లుల్ని పెంచడం |


నెహ్రూతో..

ఆయన మెడ దగ్గర నరాలు ఉబ్బి మరింత ఎర్రగా కనిపించారు. సరిగ్గా ఆ సమయానికి అక్కడకు ఇందిరా గాంధీ వచ్చారు. ఆ దృశ్యం చూసి 'వాట్ నాన్సెన్స్ ఈజ్ దిస్' అంటూ పాములవాణ్ని పెద్ద స్వరంతో అదిలించారు. ఆమె గొంతులోని తీవ్రత మా అందర్నీ ఆశ్చర్యపరిచింది. పాములవాడయితే భయపడి తట్టాబుట్టా సర్దేసుకున్నాడు. నెహ్రూగారు మాత్రం 'ఏం లేదు తల్లీ, ఫర్లేదులే' అని ఆమెని సముదాయించారు. అది మొదలు నాకు ఇందిరాగాంధీ అంటే ప్రత్యేక అభిమానం ఏర్పడిపోయింది. ఏదో రాణి రుద్రమను చూసినట్టు అనిపించింది. తర్వాత జనవరి ఒకటికి ఆమెకు నేను తయారు చేసిన గ్రీటింగ్ కార్డు కూడా పంపాను.

**★ మళ్లీ కథల్లోకి వద్దాం, మీ సెకెండ్ ఇన్నింగ్స్ ఎప్పుడు మొదలయ్యింది?**

'ప్రయాణం' కథ 1965లో వచ్చింది. దాదాపు పదేళ్ల విరామం తర్వాత వచ్చిన కథ అది. దాంతోనే కథకురాలిగా పాఠకుల దగ్గర గుర్తింపు లభించింది. ఇప్పటికి మొత్తం అరవై కథలు రాసుంటాను. కొన్ని నా జీవితంలోంచి, మరికొన్ని నాకు తెలిసిన స్త్రీల జీవితాల్లోంచి స్వీకరించినవి. ఎక్కువ మేరకు ఉత్తమ పురుషలోనే రాశాను. నాతోటి స్త్రీలకు జరిగిన అనుభవాలను కూడా నాకు జరిగినట్టుగా స్పందించి రాశాను. 1991లో నా మొదటి కథా సంపుటం ఒక మిత్రుడి సహకారంతో వెలువడింది. తర్వాత మా నాన్నగారు నాకు రాసిన ఉత్తరాల ఆధారంగా నేను రాసిన 'మృత్యుంజయ' 93లో ప్రచురితమయింది. 96లో దీనికి తెలుగు విశ్వవిద్యాలయం 'రచయిత్రి ఉత్తమ రచన' అవార్డు లభించింది.


ఆ రోజుల్లో...

**★ పురుషాధిక్యత గురించి రాసినా తీవ్రంగా ఉండవు మీ రచనలు. ఎందుకని? వరదగారు ఏమనేవారు మీ కథల గురించి?**

చిన్నపిల్లలకు మంచి విషయాలను చెబుతున్నట్టుగా, చక్కెర పూసిన మాత్రల్లాగా ఉండాలి కథలని నా అభిప్రాయం. అందువల్లే నా కథలు అలా ఉంటాయి. ఇక మావారు ప్రధానంగా కవి. కనుక కథలంటే పెద్ద ఆసక్తి ఉండేది కాదు. నావైనా ఎవరివైనా. మరీ అడిగితే 'బాగానే రాస్తావులెద్దూ.. మళ్లీ ఎందుకు చూడ్డం' అనేసేవారు. 'గడ్డునెల' అనే కథ గురించి చెప్పినప్పుడు మాత్రం ఛీ అనేశారు. ఆయనకా కథాంశం ఏమీ నచ్చలేదు. కథలనే కాదు, ఎందులోనూ తీవ్రవాదం నాకు నచ్చదు. అందుకే నక్సలిజానికి నేను వ్యతిరేకిని. ఇప్పుడొస్తున్న సినిమాలూ సీరియళ్లలో చూపెడుతున్న హింస, కుట్రలు చూస్తే అమ్మో అనిపిస్తుంది. హింసలేని కుటుంబం, సమాజం ఏర్పడాలి.

**★ జిడ్డు కృష్ణమూర్తి బోధనల ప్రభావమా?**

మా నాన్నగారు ఆయన అభిమాని. న్యాయవాద వృత్తిని విరమించుకుని 'నచికేతుడు' అని పేరు పెట్టుకున్నారు. కృష్ణమూర్తిగారి ఫస్ట్ అండ్ లాస్ట్ ఫ్రీడమ్ అనే పుస్తకాన్ని గ్రాంథిక భాషలోకి అనువదించారు. నేను ఆయన 'కామెంటరీస్ ఆన్ లివింగ్'ను 'మన జీవితాలు- జిడ్డు కృష్ణమూర్తి వ్యాఖ్యానాలు'గా అనువదించాను. ఆధ్యాత్మిక జీవితం కేవలం వృద్ధాప్యానికి పరిమితమైనది కాదు. ఆధ్యాత్మిక దృక్పథంతో జీవిస్తే నిత్యజీవితం సంఘర్షణ రహితంగా ఉంటుందనీ, మానవసంబంధాలు మెరుగుపడతాయని గ్రహించాను. దాన్ని చిన్నప్పటినుంచీ అలవరిస్తే సమాజం హింసారహితంగా, కాలుష్య రహితంగా, శాంతియుతంగా మారే అవకాశం ఉంటుంది.

**★ ఇప్పుడొస్తున్న కథాసాహిత్యంపై మీ అభిప్రాయం?**

మంచి కథలు వస్తున్నాయి. కొండేపూడి నిర్మల రాసిన 'దృశ్యకీచకం' వంటివి ఆధునిక జీవితానికి అద్దంపడుతున్నాయి. అనుభవాల విస్తృతి, ప్రపంచీకరణ, వలసలు పెరుగుతున్నకొద్దీ వైవిధ్యం నిండిన కథలు వస్తున్నాయి. కానీ ఎక్కువ వాటిలో అనుభూతి సాంద్రత లోపించడం వల్ల ఆకట్టుకోవడం లేదు. రెండోది సాహిత్యం ప్రాంతం, వర్గం, మతం అంటూ చీలిపోవడం నాకు పెద్ద ఇష్టం లేదు. సాహిత్యం కొంత ఆదర్శవంతంగా ఉండాలి. భాష, మాండలికాలు కూడా అంతే. 'ఎవరి జీవన స్థాయి నుంచి వారు రాస్తాం..' అంటున్నారు. కానీ జాషువా వంటి మహాకవులు అలా అనలేదే! మనం ఇలాగే రాస్తుంటే తర్వాతి తరాలు మంచి భాషను ఎలా నేర్చుకుంటాయి?

– అరుణ పప్పు

నాకు నచ్చిన నా కథ

# స్పర్శ

- అబ్బూరి ఛాయాదేవి

నేను వెళ్లేసరికి నవారు మంచం మీద గోడ వైపు తిరిగి పడుకుని ఉన్నారు నాన్నగారు.

చెప్పులు వీధి గుమ్మంలోనే విడిచి వెళ్లానేమో, నేను వచ్చినట్లు ఏ విధమైన శబ్దమూ కాలేదు. మంచం దగ్గరగా వెళ్లి, 'పడుకున్నారా?' అన్నాను.


'ఎవరూ?' అంటూ ఇటు వైపుకి ఒత్తిగిల్లారు.

'నేనే' అన్నాను.

'రా, ఇలా కూర్చో' అన్నారు పడుకునే. నేను అక్కడున్న ఒక స్టీలు కుర్చీ కొంచెం పక్కకి లాగి కూర్చోబోతూంటే ఆ చప్పుడు విని, 'అంతదూరంలో ఎందుకు? ఇలా వచ్చి కూర్చోవమ్మా' అంటూ, మంచం మీద తను లేచి కూర్చుని, నాకు తన పక్కన చోటు చూపించారు చేత్తో మంచం మీద తట్టుతూ.

నేను వెళ్లి మంచం పట్టీమీద కూర్చున్నాను.

నాన్నగారు చేత్తో తడుముతూ నా వీపు మీద చెయ్యివేసి, తన పక్కన మంచం మీద తడిమి, 'సరిగ్గా కూర్చోమ్మా' అన్నారు.



నేను కొంచెం వెనక్కి జరిగి సర్దుకున్నాను.

ఆయన చేత్తో తడుముతూ, నా చెయ్యి అందుకుని తన చేతుల మధ్య పెట్టుకుని, 'నువ్వొస్తానని రోజూ ఎదురు చూస్తున్నాను. అంతా కులాసాగా ఉన్నారా?' అన్నారు.

'ఊఁ' అన్నాను సన్నగా.

ఆయన ఇంకేమీ మాట్లాడకుండా నా చెయ్యి నిమురుతూ ఉండి పోయారు.

ఇది వరకోసారి – అంటే, నేను యుక్త వయస్సులో ఉన్నప్పుడు – నాన్నగారూ, నేనూ ఒకే రిక్షాలో వెళ్లవలసి వచ్చింది ఎక్కడికో. రిక్షా విశాలంగా ఉన్నా, నేను ఒక వైపుకి బాగా ఒదిగి కూర్చున్నాను.

'సరిగ్గా కూర్చోమ్మా పడిపోతావు' అన్నారు నాన్నగారు.

నేను మొహమాట పడుతూ ఒక అంగుళం ఆయన వైపుకి జరిగాను.

నాకు అక్షరాభ్యాసం అయినప్పటి నుంచి ఆయన నన్ను క్రమశిక్షణ పేరుతోనూ, మడీ, ఆచారం కారణాల వల్లనూ, చూపులతోనే అల్లంత దూరాన నిలబెట్టి మాట్లాడటం అలవాటయి, ఆయన దగ్గర చనువు తీసుకునే సాహసం హరించుకుపోయింది నాన్నగారిని ఏ సమయంలో చూసినా మడికట్టుకున్నట్లుగానే అనిపించి, నాకు ముడుచుకు పోవడం అలవాటయిపోయింది. అలాంటిది, రిక్షాలో ఆయన్ని అంటుకునేట్లు ఎలా కూర్చోగలను?

స్కూలు నుంచి రాగానే ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని ఆ ప్రశ్నలూ, ఈ ప్రశ్నలూ వేస్తే స్కూలు కబుర్లన్నీ చిలకలా చెబుతారు పిల్లలు. అంతేకాని, 'లెక్కల్లో మార్కులెన్నొచ్చాయి?' అనో, లేదా 'మార్క్సుషీటు పట్టుకొచ్చావా?' అనో గుడ్లురుమూతూ వీధి గుమ్మంలోనే నిలదీస్తే పిల్లలు బిక్కచచ్చి పోరూ! అలా బిక్కచచ్చిపోతూనే బతికాను ఇరవై ఏళ్ళు వచ్చేవరకూ. ఆ బెదురు ఇంకా పోలేదు.

నాన్నగారికిప్పుడు ఎనభై దాటాయి. ఆపరేషను చేస్తే కంటి చూపు వచ్చే వయస్సు దాటి పోయింది. తక్కిన విషయాల్లో అనారోగ్యం లేకపోయినా, దృష్టిలోపమే ఆయన్ని బలహీనుణ్ణి చేసింది. మంచం మీదే గడుపుతున్నారు రెండేళ్ల నుంచీ.


మా అత్తగారికి ఒంట్లో బాగాలేదని తెలిసి, ఇద్దరం సెలవు పెట్టుకుని వచ్చాం. ఆవిడ దగ్గర కొన్నాళ్ళుందామని. నేను ఎలాగో వీలుచేసుకుని అప్పుడప్పుడు అమ్మనీ, నాన్నగారినీ చూడటానికి వెడుతున్నాను ఊళ్లోనే కనుక. వెళ్లినప్పుడల్లా ఓ అరగంట సేపు కూర్చుని ఆయనతో మాట్లాడి వచ్చేస్తున్నాను.

నాన్నగారికి సమీపంగా సన్నిహితంగా కూర్చోవడం అన్నది లీలగా మిగిలిపోయిన బాల్యస్మృతి! ఇప్పుడు ఆయన నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా స్పృశిస్తూంటే నా చిన్నతనం నుంచీ ఆ స్పర్శకోసం నేను అంతరాంతరాల్లో పొందిన తపనంతా కళ్లకు కట్టినట్లై కళ్ల నీళ్లు తిరిగాయి. మాట్లాడాలంటే గొంతు గాద్గదికమైంది. ఆయన ప్రేమ పూరితమైన స్పర్శ కోసం ఒకప్పుడు తపించి పోయానన్న సంగతి ఆయనకెప్పుడైనా స్ఫురించి ఉంటుందా?

మా ఇద్దరి మధ్యా ఉత్తరాల్లో ప్రవహించిన ప్రేమ ప్రవాహమంతా మేము ఒకరికొకరం ఎదురు పడినప్పుడు ఆయన గాంభీర్యానికి, తీక్షణ వీక్షణాలకీ ఆవిరి అయిపోయేదేమో! చిన్నప్పటి నుంచీ సూర్యకిరణాల్లా చురుక్కుమనిపించేటటువంటి ఆయన చూపుల్ని తట్టుకోలేక, భరించలేనట్లు తప్పించుకు తిరగటం అలవాటయిన నేను, ఆయన కళ్లిప్పుడు ఆర్పేసిన దీపాలని తెలిసినా ఎందుకు చనువు తీసుకోలేక పోతున్నాను?

ఊరు నుంచి వచ్చిన మొదట్లో ఆయన దగ్గర కూర్చున్నప్పుడు నవారు మంచం పట్టీ మీద నల్లులు పాకుతూండడం గమనించాను. ఒకటి రెండు చడీచప్పుడు కాకుండా తీసి కాలికింద వేసి నలిపేశాను.

ఆ తరవాత మా ఇంట్లో మంచం మీద ఒక నల్లి కనిపించే సరికి మా వారు అదెలా వచ్చిందని గాభరాపడ్డారు. బహుశా మా నాన్నగారి మంచం దగ్గర కూర్చున్నప్పుడు నా బట్టల్లో దూరి [illegible]నా వచ్చిందేమోనని చెప్పాను. నేను మళ్లీ నాన్నగారిని చూడటానికి బయలుదేరుతుంటే, నాన్నగారి మంచం దగ్గర కూర్చోవద్దనీ, దూరంగా కుర్చీలో కూర్చుని మాట్లాడి రమ్మనీ మా వారు హెచ్చరించారు.



నేను కుర్చీని దూరంగా జరిపి కూర్చోబోతూంటే నాన్నగారు నన్ను తనకి దగ్గరగా కూర్చో మన్నారు! ఎలా కాదనడం? ఆయనకు అనుకున్నట్లుగా కూర్చుని ఆయన చేతిలో చెయ్యి వేసే వరకూ ఆయనకు తృప్తి కలగలేదు.

మగపిల్లల కోసం జీవితమంతా తపించిన నాన్నగారికి చివరికి ఆడపిల్లలమే మిగిలాం! జీవిత చరమదశలో చెట్టంత వంశోద్ధారకుడు – ఉన్న వాడొక్కడు పోయాడు. విధి రాత అంటే ఇదేనేమో! అన్నయ్య పోయినప్పుడు నాన్నగారి ఎదుటకి వెళ్లడానికి ఏదో జంకు – ఏదో తప్పు చేసిన భావన వెనక్కిలాగేది. నాన్నగారిని పొదివిపట్టుకుని 'ఏడవద్దు, మీకు నేనున్నాను' అని చెప్పాలని పించింది. కాని, ఆయన్ని స్పృశించడానికే బెదురు. ఆయన పెంచిన పెంపకం అలాంటిది.

నాన్నగారితో కాస్సేపు కూర్చుని మాట్లాడిన తరవాత, తన చేతి గోళ్లూ, కాలిగోళ్లూ కత్తిరించి పెట్టమన్నారు. రోలొచ్చి మద్దెలతో మొర పెట్టుకున్నట్లు అటువంటి పనులు అమ్మకి చెప్పి లాభం లేదు. అన్నయ్యకి చెప్పడానికి వాడు లేడు. వాడి పిల్లలిక్కడ లేరు. వదినకి చెప్పలేక కాదు. నా చేత ఏదో సేవ చేయించుకోవాలన్న తనపనతో కావచ్చు – నన్నే అడిగారు. అదే మహాభాగ్యమన్నట్లు మురిసిపోతూ శ్రద్ధగా కత్తిరించాను.

నాన్నగారి మనస్సు బావుండక కాబోలు, నా చెయ్యి నిమురుతూ, 'మీరు ఈ ఊరికి వచ్చేసినా బావుండును, మీ దగ్గరకి వచ్చి ఉండేవాడిని' అన్నారు.' నేను నిస్సహాయంగా చూశాను. ఆ చూపులు ఆయనకు కనిపించవు. నా మాటలు ఆయనకు సాంత్వనం కలిగించేటట్లు లేవు.

నాన్నగారు ఇంకేమీ అడక్కుండా నిశ్శబ్దంగా నా చెయ్యి నిమురుతూ కూర్చుండి పోయారు. ఆ క్షణంలో నాకు ఈ విద్య, ఉద్యోగం – అన్నీ అలంకార ప్రాయంగా తోచాయి. కాస్సేపు అలాగే కూర్చుని, వెళ్లొస్తానని చెప్పి లేచాను.

రిక్షాలో కూర్చుని తిరిగి వస్తూంటే నాన్నగారి మృదుస్పర్శ నన్ను వెంటాడుతున్నట్లు తోచి, నా కన్నుల నిండా నీరు నిండి, మార్గమంతా మసక మసగ్గా కనిపించింది.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక **31-3-89**)*

*

## కథాంతరంగం :



'స్పర్శ' కథ కూడా నా జీవితానుభవాల్లోంచి పుట్టిందే. చిన్నప్పట్నుంచీ మా నాన్నగారంటే భయమూ, భక్తీ. ప్రేమకూడా ఉండేది గానీ, దాన్ని స్పర్శ ద్వారా వ్యక్తీకరించడం ఆయనా చెయ్యలేదు, మేమూ చెయ్యలేదు. పైగా మడీ ఆచారం అంటూ ఎప్పుడూ ముట్టుకోనిచ్చేవారు కాదు. అలాంటిది ఆయన వృద్ధాప్యంలోకి వచ్చాక, దృష్టి మందగించింది. నేనెప్పుడయినా చూడటానికి వెళితే 'దామ్మా, ఇలా దగ్గరగా కూచో' అంటూ మంచం మీద తట్టి చూపించేవారు. చేతిలో చెయ్యి వేసి మాట్లాడేవారు. కూతురిని స్పర్శించాలని అప్పుడనిపించేదేమో మరి. కానీ నాకు మాత్రం బెరుగ్గా ఉండేది. దాన్నంతటినీ ప్రతిఫలిస్తుంది 'స్పర్శ' కథ.